తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాదాద్రిభువనగిరి
గురువారం
27 జూన్ 2024
పేజీలు : 08
Follow :

# మాదక ద్రవ్యాలతో జీవితాల నాశనం

**మత్తు,మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోదాడలో ర్యాలీ**

**యువత మాదక ద్రవ్యాలకు**
**దూరంగా ఉండాలి**
**కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**
**ఆర్డీవో సూర్యనారాయణ**
**డీఎస్పీ శ్రీధర్ రెడ్డి**




కోదాడ టౌన్ జూన్ 26 ( జనంసాక్షి ) గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రజలందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆర్డీవో సూర్యనారాయణ,డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ప్రజా,ప్రతినిధులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి వలన యువత పెడదారి పడుతుందని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గంజాయి, డ్రగ్స్,మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం కాశీనాథం ఫంక్షన్ హాల్ లో కళాశాల విద్యార్థులకు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా డ్రగ్స్ తీసుకుంటే కలిగే నష్టాలను వీడియోల రూపంలో చూపించారు.డిఎస్పి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తులో చిత్తు కావద్దని ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితం అంధకారం అవుతుందని మొబైల్ ఫోన్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకై కళాశాలల్లో, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ ప్రమాణం చేయించారు.మత్తు పదార్థాలు సేవించిన, విక్రయించిన చట్టరీత్యా నేరమని డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్మన్ సామినేని. ప్రమీల, వైస్ చైర్మన్ కందుల.కోటేశ్వరరావు,ఎంపీపీ మల్లెల.రాణి,జడ్పిటిసి కృష్ణకుమారి,కోదాడ పట్టణ సిఐ రామ,రూరల్ సీఐ రజిత రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి. సుబ్బారావు, డివిజన్ విద్యాధికారి సలీం షరీఫ్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వేముల. వెంకటేశ్వర్లు, డాక్టర్ దశరథ,ఎస్ఐలు రంజిత్ రెడ్డి,అనిల్ రెడ్డి, నవీన్, రాంబాబు,మల్లేష్,మున్సిపల్ కౌన్సిలర్లు, డాక్టర్లు,న్యాయవాదులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తరిగిపోతున్న సహజ వనరులు

**నల్ల మట్టి అక్రమ రవాణా**
**అడ్డు అదుపు లేకుండా భారీగా నల్లమట్టి వ్యాపారం**
**చింతపల్లి టు కోహెడ**
**రోజుకు 100 నుండి 200 టిప్పర్లు**
**సాగర్ హైవేపై ప్రజలకు నరకయాతన**
**భారీగా ముడుపులు అందుకున్న అధికారులు**
**ఓవర్ లోడ్ తో ప్రమాద అంచున టిప్పర్లు**
**పర్మిషన్ ఉన్నది గోరంత అయితే తోవ్వేది కొండంత** 2



# తీవ్ర ఉద్యృత రూపం దాల్చిన భూ నిర్వాసితుల ఉద్యమం

**మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**
**నర్సిరెడ్డిగూడెం కి వెళ్లే దారిని మూసి వేస్తున్న రిజర్వాయర్ కాంట్రాక్టర్**
**వెంటనే తమకు పునరావాసం కల్పించాలని ఉధృతంగాగా ఉద్యమం**
**అధికారులకు పోలీసులకు భూ నిర్వాసితులకు తీవ్ర మాటలు యుద్ధం**
**ఊరికి వెళ్లే దారిని మూసివేస్తే బయటికి ప్రపంచంతో**
**సంబంధాలు తెగిపోతాయి, ఊరికి వెళ్లే దారి ఒకే ఒక్కటి**





మర్రిగూడ, జూన్26, జనంసాక్షి:
మర్రిగూడ మండలంలోని శివన్న గూడెం రిజర్వాయర్ పరిధిలోని ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే దారిని బుధవారం ఉదయం రిజర్వాయర్ కాంట్రాక్టర్ మూసి వేయడానికి ప్రయత్నం చేశారు, వెంటనే నర్సిరెడ్డి గూడెం గ్రామ ప్రజలను పనులను అడ్డుకున్నారు, తమకు రావలసిన నష్టపరిహారం, పునరావాసం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు, నర్సిరెడ్డిగూడెం ఊరు నుండి బయటకు రావడానికి ఒకే దారి ఉన్నది, ఆ దారిని మూసి అక్కడ కట్ట నిర్మాణం జరిగితే వర్షానికి వచ్చే వరదలతోనే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉంది, అధికారులకు పోలీసులకు భూ నిర్వాసితులకు తీవ్ర మాటలు యుద్ధం జరిగింది, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు, ఎన్నికలవేళ తమకు రావాల్సిన నష్టపోరాటంతో పాటు పునరావాసాన్ని వెంటనే ఏర్పాటు చేస్తానని చెప్పి ఇప్పుడు చేయడం లేదని వారు వాపోయారు, ఇరిగేషన్ అధికారి డి ఈ ఖాసీం, నాంపల్లి సీఐ నవీన్ కుమార్ భూ నిర్వాసితులతో మాట్లాడడం జరిగింది, వారం వరకు ఇలాంటి నిర్మాణ పనులు చేయమని వారం లోపల తమకు రావాల్సిన నష్టపరియారాన్ని, పునరావాసాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను కలిసిన నాయకులు

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను అఖిలపక్ష పార్టీ నాయకులు కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కరుణాకర్ రెడ్డి, దేవరశెట్టి సత్యనారాయణ, అబీద్, కోట గోపి, దేగల రమేష్, స్టాలిన్ పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామి వారి త్రయోదశ వార్షికోత్సవ మహోత్సవం



గరిడేపల్లి, జూన్ 26 (జనం సాక్షి):
గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామం నందలి శ్రీహరిహరపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి త్రయోదశ వార్షికోత్సవ మహోత్సవము అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగినది. ఉదయం సుప్రభాత సేవ, మామిడి తోరణాలు, గణపతి పూజ, పుణ్యాహవాచనము, దీక్షాధారణ, రక్షాబంధనము, పంచగవ్యప్రాసనము, స్వామివారికి మహన్యాస పూర్వకంగా రుద్రాభిషేకము శ్రీలక్ష్మీ గణపతి, రుద్ర, నవగ్రహ, వాస్తు హోమములు మహాపూర్ణాహుతి స్వామి వారికి విశేష పుష్పాలంకరణ దేవాలయ అధ్యక్షులు అమరగాని బిక్కయ్య నారాయణమ్మ దంపతుల చేతుల మీదుగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి తదుపరి అన్నదాన కార్యక్రమం దేవాలయం కమిటీవారిచే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు, పిల్లలు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కొంగుబంగారమై కొలువున్న శ్రీ హరిహరపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దర్శనం చాలా విశేషమని కమిటీ వారు తెలియజేశారు. పూజా కార్యక్రమాలు దేవాలయ అర్చకులు రాయప్రోలు భద్రయ్య శర్మ ,శ్రీరామయ్య శర్మ, ఉపేందర్ శర్మ, పవన్ కుమార్ శర్మ, ప్రణయ్ శర్మ, అనిల్ కుమార్ శర్మ నిర్వహించారు.

# తరిగిపోతున్న సహజ వనరులు

మద్రిగూడ, జూన్ 27, జనం సాక్షి:
తరిగిపోతున్న సహజ వనరులు, చింతపల్లి టు హైదరాబాద్ కు భారీగా నల్లమట్టి సరఫరా, హైవేపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్న జనాలు 100 నుండి 200 టిప్పర్లతో నల్ల మట్టి రవాణా, రోజుకు 24 గంటలు సాగుతున్న నల్లమట్టి రవాణా, టిప్పర్లలో ఓవర్ లోడ్ తో సాగర్ హైవేపై వెళ్తున్న పట్టించుకోని అధికారులు, ఒక రైతు తమ పొలంలోకి నల్ల మట్టి తీసుకు వెళ్లడానికి సవ లక్ష కారణాలు చూపే అధికారులు, ఒక వ్యాపారవేత్తకు మాత్రం ఇలాంటి అడ్డంకులు రాకుండా చూస్తారు, అధికారులు తమ సొంత ప్రయోజనాల కోసం కాసులకు కక్కుర్తి పడి పర్యావరణాన్ని పాడు చేస్తున్నారు, పర్మిషన్ తీసుకున్నది గోరంత అయితే తోడేది మాత్రం కొండంత మంగళవారం జిల్లా కలెక్టర్ సి, నారాయణ రెడ్డి రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో ఇసుక, నల్ల మట్టి అక్రమ రవాణా పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, కానీ అధికారులలో ఏమాత్రం చలనం లేదు, ఇలా అడ్డు అదుపు లేకుండా ఇలా సహజ వనరులను కొల్లగొడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది, చింతపల్లి, దేవరకొండ మండలాల నుండి జోరుగా నల్లబట్టి అక్రమ రవాణా కొనసాగుతుంది, ఇలాంటి అడ్డు అదుపు లేకుండా ఈ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది, అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా ఈ వ్యాపారం కొనసాగుతుంది. ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన పాలసీని తీసుకువచ్చి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గ్రామాభివృద్ధికై పల్లె దవాఖాన స్థలాలు యిచ్చిన దాతలకు ఘన సన్మానం



గరిడేపల్లి, జూన్ 26 (జనం సాక్షి):
వెలిదండ గ్రామంలో గ్రామాభివృద్ధికై ప్రభుత్వ భవనాలు నిర్మించుటకు స్థలాలు యిచ్చిన దాతలు పల్లె దవాఖానకు ఉచితంగా స్థలాన్ని యిచ్చిన కంభంపాటి గాంధీ సార్ సతీమణి కోటిరత్నమ్మ, కంభంపాటి వెంకటరమణ స్వప్న దంపతులు, కంభంపాటి శ్రీనివాస్ లక్ష్మి శైలజ దంపతులు పశు వైద్యాశాలకు ఉచితంగా స్థలాన్ని యిచ్చిన కొల్లు విద్యాసాగర్ పద్మావతి దంపతులు, సున్నా సత్య నారాయణ లక్ష్మి కాంతమ్మ దంపతులకు గ్రామ పెద్దల అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో ,తెలంగాణ మాలిదశ ఉద్యమ కారుల జేఏసీ కన్వీనర్ మేకల నాగేశ్వరావు , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చెనగాని సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు, ఎలుగురి నర్సింహారావు, చెనగాని రామయ్య, సర్పంచ్ ఆదూరి కోటయ్య – పద్మా దంపతులు, రిటైర్డ్ టీచర్ పోటు సీతారాములు సార్, మాజీ సర్పంచి మాశెట్టి అంజయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సీపీఎం పార్టీ మండల అధ్యక్షులు యానాల సోమయ్య, సిపిఐ పార్టీ గ్రామ కార్యదర్శి మామిడి శ్రీను, సిపిఐ ఎమ్మెల్ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు, వెలిదండ గ్రామ కార్యదర్శి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో స్థలాలు దాతలకు మెమోంటం ఇచ్చి శాలువా కప్పి సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికై ప్రభుత్వం భవనాలు నిర్మించుటకు ఉచితంగా స్థలాలు యిచ్చిన దాతలకు ప్రత్యక ధన్యవాదములు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమం లో వల్లపుదాస్ రాజు, చెనగాని వెంకన్న, వీసాల నాగరాజు, బెల్లంకొండా మోహన్ రంగా, గండు యల్లయ్య, కమళ్ళ కిరణ్, గండు శ్రీను, గండు పెద్ద వెంకటి, వంగాల అంజయ్య చారి ,చెనగాని లింగయ్య, ఆదూరి శ్రీను, ఆదూరి కార్తీక్, ములకలపల్లి నాగరాజు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రైతు భరోసా నిధులను వెంటనే

# రైతుల ఖాతాలో జమ చేయాలి

### పోకల వెంకటేశ్వర్లు సిపిఐ మండల కార్యదర్శి..



గరిడేపల్లి, జూన్ 26 (జనం సాక్షి):
వానాకాలం సీజన్ ప్రారంభం అయి రైతాంగం మొత్తం వ్యవసాయ పనులలో బిజీగా వున్నారని, రైతుల పెట్టుబడికి ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా నిధులను వెంటనే ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ సీజన్ ప్రారంభం అయి వ్యవసాయ పనులు ముమ్మరంగా నడుస్తున్న తరుణంలో రైతు భరోసా ఎవ్వరికి ఇవ్వాలి,ఏ విధంగా ఇవ్వాలి అని అభిప్రాయ సేకరణ పేరుతో సమయానికి రైతు భరోసా నిధులు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టటం సరికాదని ఆయన అన్నారు.ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా ఎకరాకు 7500 రూపాయల చొప్పున రైతుల ఖాతాలలో జమ చేసి ఆదుకోవాలని అయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# యువత మత్తులో పడితే జీవితాలు చిత్తు



నేరేడుచర్ల( జనంసాక్షి):
యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని, డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందని ,విషయాన్ని గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుడిపాటి లక్ష్మయ్య అన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవ సందర్భంగా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గుడిపాటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మత్తు పదార్థాలపై ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం సరదాగా ప్రారంభమయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యక్తులను బానిసలుగా మారుస్తుంది ప్రధానంగా యువత వీటికి అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తు అంధకారంగా మారడంతో పాటు వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుంది ప్రధానంగా యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు వీటికి బానిసలుగా మారిన వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే త్వరగా కోలుకుంటూరు.ఆలస్యం చేస్తే మాత్రం తీవ్ర దుష్పరిణామాల బారిన పడతారు రాష్ట్ర ప్రభుత్వం సైతం మాదకద్రవ్యాల నియంత్రణకు బకద్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**సిఐ ధనుంజయ ఎస్ఐ రామ్మూర్తి**

**డ్రగ్స్ రహిత సమాజమే పోలీసుల లక్ష్యం**

**యువత డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలి**

**కొండమల్లేపల్లిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేక ర్యాలీలో**

**పాల్గొన్న పోలీసులు ప్రజలు యువత**

కొండమల్లేపల్లి జూన్ 26 జనం సాక్షి :
ప్రపంచ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవ సందర్భంగా బుధవారం కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ ఎస్ఐ రామ్మూర్తి ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాదక ద్రవ్యాలకు యువత బానిసై జీవితాలను కోల్పోతున్న తరుణంలో మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ ధనుంజయ ఎస్ఐ రామ్మూర్తి తో కలిసి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలను దుర్భరమవుతున్నాయని అన్నారు యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఇందుకు కారణమవుతున్న గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత పాలుపంచుకోవాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, నిషేధిత డ్రగ్స్ వాడడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు,ఇతర నేరాలకు పాల్పడుతూ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీసు శాఖ మీడియా యువత సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు నిషేధిత మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని తెలిపి తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని పేర్కొన్నారు

## నూతన భవనంలోకి

## కస్తూరిబా విద్యాలయం



పాలకవీడు( జనంసాక్షి)
మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం బుధవారం మండల కేంద్రంలోని నూతన భవనంలోకి మార్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి భూక్యా గోపాల్ నాయక్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి కొత్త భవనంలో పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని,మంచిగా చదివి ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోత్ మోతిలాల్ నాయక్, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు మీసాల ఉపేందర్, ఎంపిడిఓ లక్ష్మి,ఎంఈఓ పానుగోత్ చత్రు నాయక్,ఎస్ ఓ సుజాత, ఉపాధ్యాయినిలు, బాలికలు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం అమలు తీరుపై మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్

కల్లూరు జూన్ 26(జనం సాక్షి)
కల్లూరు మండలంలోని కొర్ల గూడెం రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో రైతు భరోసా పథకం అమలు తీరుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలోని రైతుల అభిప్రాయాలను సేకరించి ఏ విధంగా రైతు భరోసా పథకం కింద ఆర్థిక చేయూతనిస్తే ఎక్కువ మంది రైతులకు లాభాలు చేకూరుతాయో, ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తే ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరుతుందో వంటి అంశాలను క్షేత్రస్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడి అభిప్రాయాలను సేకరించడం జరిగింది. అదేవిధంగా ప్రతి రైతు వేదిక లో ఈ సమావేశానికి హాజరైనటువంటి రైతుల యొక్క అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని క్షేత్రస్థాయిలో పని చేస్తున్నటువంటి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించడం జరిగింది.. ఈ



కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు యు నరసింహారావు, కల్లూరు మండల అగ్రికల్చరల్ అధికారిని మాదాబత్తుల రూప, నియోజకవర్గంలోని పలు మండలాల ఏవోలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కరాటే నేర్చుకున్న వారు ఆత్మవిశ్వాసంతో జీవించవచ్చు

## బుడిగెం శ్రీనివాస్, డాక్టర్ సీతయ్య

ఖమ్మం ఆర్సి, జూన్ 26(జనంసాక్షి)
నేటి సమాజంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ కోసం మనోధైర్యాన్ని పెంపొందించుకోవడానికి శారీర దృఢత్వం ఆపదలో తమని తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ కరాటే నేర్చుకోవడం అత్యవసరమని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు 45వ డివిజన్ కార్పోరేటర్ బుడిగెం శ్రీనివాస్, సీనియర్ డాక్టర్ సామినేని సీతయ్య, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు, కార్యదర్శి కొండమీద వెంకట్, కార్మిక నేత మంద వెంకటేశ్వర్లు తెలిపారు. ఈరోజు బుధవారం స్థానిక ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లో గత 50 రోజులుగా ఝాన్సీ లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ పర్ గల్స్ పేరుతో ఉచిత కరాటే శిక్షణ సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన చిన్నారులు చేసిన పలు సాహసోపేత విన్యాసాలు ముగ్గురు పిల్లలు పడుకుంటే వారిపై నుండి బైక్ పై ఇద్దరు ఉండి బైక్ పోనియడం ఒళ్ళు గగురుపొడిందని విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయని తెలిపారు. ఆడపిల్లపై దాడుల జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, పిల్లలను ఎత్తుకెళ్లె టప్పుడు ఎలా తిప్పికొట్టాలి, యాసిడ్ దాడుల జరిగినప్పుడు ఏంచేయాలి అనే పలు అంశాలపై కరాటే కోచ్ నేర్పడం జరిగిందన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ. సెల్ఫ్ డిఫెన్స్



పర్ గల్స్ ఆడపిల్లలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని. కరాటే విద్య నేర్చుకొవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. కరాటే నెర్చుకునే వారిలో అబ్బాయిలతో పోలిస్తే చాలా మంది అమ్మాయిలు శారీరకంగా బలహీనంగా ఉంటారని కితాబు ఇచ్చారు. అందువల్ల అమ్మాయిలకు కరాటే విద్య ఉపయోగపడుతుందని తెలిపారు. కరాటే ప్రాక్టీస్ చేసే వారు శారీరకంగా మెరుగుపడతారని ఫలితంగా మానసికంగా కూడా దృఢంగా తయారవుతారని అన్నారు. కార్యక్రమం లో కారాటే మాస్టర్స్ యం. బాబు, పాషా, షకీరా లతో పాటుగా వెంకట్, సుదర్శన్, నిరంజన్, శ్రీనివాస, దుర్గాప్రసాద్, అంబాల వెంకటేశ్వర్లు, విజయకుమార్ మరియు విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు..

# కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలి

## నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

ఖమ్మం అర్బన్,జూన్26(జనంసాక్షి)
దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన,నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ జిల్లా కార్యదర్శి తుడుం ప్ర జిల్లా కార్యదర్శి మస్తాన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్. %ూ×ఖీ% జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్ కుమార్. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల లక్ష్మీనారాయణ. కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు.స్థానిక ఖమ్మం బుధవారం కొత్త బస్టాండ్ ఎదురుగా నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దిష్టి బొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు.విద్యార్థి యువజన నాయకులకు పోలీసులు మధ్య తోపులాట జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 5న పరీక్షను నిర్వహించడం జరిగింది.దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారని, ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి యొక్క పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుందన్నారు . కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ, దక్షిణాది



రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి,కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని వారు విమర్శించారు . ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని వారు అన్నారు.లీకేజ్ బాధితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పవన్, మనోజ్,అయ్యప్ప, నరేష్,గోపి జిల్లా అధ్యక్షులు సుధాకర్, రాజు,మనోజ్,వినోద్ రావు జిల్లా నాయకులు క్రాంతి, మణికంఠ, గోపి, రామకృష్ణ. జిల్లా నాయకులు శ్రీనివాసరావు నాగరాజు కూరపాటి శ్రీను. జిల్లా కార్యదర్శి రమేష్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

కల్లూరు జూన్ 26(జనం సాక్షి)
నేటి సమాజంలో యువత డ్రగ్స్ ,గంజాయి , గుట్కా, పాన్ మసాలా వంటి మత్తుపదార్థాలు వినియోగిస్తూ వాటికి బానిసలై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని , మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాటం చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం కల్లూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కారించుకొని కల్లూరు పోలీస్ స్టేషన్ నుంచి నేషనల్ హైవే ప్రధాన రహదారి మీదగా చంద్రుపట్ల క్రాస్ రోడ్డు నుండి ప్రతిభ కళాశాల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనార్థాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్కే షాకీర్, తహసిల్దార్ పులి సాంబశివుడు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తదితరు లు పాల్గొని ప్రసంగించారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని యువత గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల రవాణా, సరఫరా వినియోగాన్ని నిర్మూలించి తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తుందని, తెలిపారు. మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని సృష్టించేందుకు యువత ,విద్యార్థులు ,ప్రజలు , భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పులి సాంబశివుడు, ఎస్సై షేక్ షాకీర్, ఏఎస్ఐ జర్పుల వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది , ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయ సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గుట్ట రిజిస్ట్రేషన్ కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## రిజిస్ట్రేషన్ కు సహకరించిన అధికారులను సస్పెండ్ చేయాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రబాబు

వైరా ,,జూన్26(జనంసాక్షి)
వైరా మున్సిపాలిటీ పరిధిలో ఐదో వార్డులో ఉన్న 98 సర్వేనెంబర్ లోని ప్రభుత్వ గుట్టాను గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు కాపాడాలని మరోసారి ప్రభుత్వ భూములను జోలికి పోకుండా ఉండేవిధంగా జిల్లా కలెక్టర్ కఠినమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్ర బాబు అన్నారు. బుధవారం యర్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ గుట్ట పక్కన ఉన్న ఇంటి స్థలం 275.5 గజాలు ఉంటే దానిని 709.5 గజాలు ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారు అధికారులకు అక్కడ భూమి ఉందా లేదా ఆ భూమి ఎవరిది అనేది తెలియదా? ప్రభుత్వం భూమి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వ భూములను గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అవినీతికి తెరలేపి అక్రమ సంపాదన కోసం వైరా నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ గుట్ట 403 గజాలు రిజిస్ట్రేషన్ చేయడం అంటే సామాన్యమైన విషయం కాదు. అన్ని తెలిసే గుట్టను రిజిస్ట్రేషన్ చేశారు అని ఆయన అన్నారు.



### గ్రామస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాలు

# ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనాలి

## బ్యాంకు ఋణాలతో కొత్త కొత్త కార్యక్రమాలను చేపట్టి ఆర్థికంగా పైకి ఎదగాలి

## గ్రామంలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి:కలెక్టర్ సి.నారాయణరెడ్డి





నల్లగొండ బ్యూరో, జూన్ 26, (జనం సాక్షి)
గ్రామస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు.స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలతో కొత్త కార్యక్రమాలను చేపట్టి ఆర్థికంగా పైకి ఎదగాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్ర సమీపంలో ఉన్న జిల్లా సమాఖ్య భవనంలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలపై మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమీక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్నదని,ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను అప్పగించిందని, అంతేకాక క్యాంటీన్ల నిర్వహణ, ఇతర వ్యాపారాల వంటి వాటిని సైతం అప్పగించడం జరుగుతున్నదని,అందువల్ల మహిళా సంఘాల సభ్యులు వీటిలో ఇంకా ప్రావీణ్యం సంపాదించి ఆర్థికంగా పైకి రావాలని కోరారు.ప్రత్యేకించి నల్గొండ జిల్లాలో అవకాశం ఉన్న వనరుల ఆధారంగా మండలాల వారీగా యూనిట్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం ద్వారా పైకి ఎదగాలని తెలిపారు.బ్యాంకుల అనుసంధానంతో ఇచ్చే లోన్ల ద్వారా ప్రతి ఒక్కరు ఆదాయం వచ్చే వ్యాపారాలు, మార్గాలు ఏర్పాటు చేసుకునేలా ఏపీఎంలు అవగాహన కల్పించాలని అన్నారు. ఉమ్మడిగా కాకుండా వ్యక్తిగతంగా యూనిట్లు ఏర్పాటు చేసే విషయమై ఆలోచించాలని, ప్రతి మండలంలో ప్రతి గ్రామం నుండి ఒక వ్యాపారవేత్త తయారయ్యేలా మహిళా సంఘాలు బలోపేతం కావాలని అన్నారు. వ్యాపారంలో విజయం సాధించేందుకు ఎలాంటి వ్యాపారాలు చేపడితే బాగుంటుందో ప్రణా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు,పాడిగేదెలు,మీ-సేవ కేంద్రాలు,కష్టం హైరింగ్ సెంటర్లు,అల్లికలు తదితర యూనిట్ల ద్వారా ఇదివరకే జిల్లాలోని మహిళా సంఘాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఈ పనులలో నాణ్యతతో పాటు,లక్ష్యాలను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.చేపట్టిన ప్రతి ఆర్థిక కార్యక్రమం క్షేత్రస్థాయిలో సరైన విధంగా అమలు కావాలని,ప్రస్తుతం నిర్వహిస్తున్న యూనిఫాంల కుట్టు పనిని ఇంకా మెరుగ్గా చేపట్టాలని, పనిలో నాణ్యత ఉండాలని, ఇంకా ఏదైనా ప్రభుత్వ పనులు ఇచ్చినప్పటికి నిర్వహించేలా మహిళలు తయారు కావాలని, రెండవ విడత దుస్తులను త్వరగా కుట్టి ఇవ్వాలని అన్నారు.పాడి గేదెల పెంపకం మంచి లాభాలను ఇస్తుందని, గ్రామస్థాయిలో ఇది ఒక మంచి వ్యాపారం అని అన్నారు.జిల్లాలో లక్ష్యాన్ని 5000 వరకు పెంచాలని సూచించారు.అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్,కష్టం మిల్లింగ్ సెంటర్ల ద్వారా ఏపిఎంలో చురుకుగా ఉండి మహిళలు అవగాహన కల్పించాలన్నారు.ప్రతి ఏపిఎం వారి పరిధిలో కొత్త వ్యాపారాలు నిర్వహించేందుకు ఆలోచించాలని,ఆర్థిక కార్యక్రమాలతో పాటు, మహిళలు గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని, ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందని,వాటిలో పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు,నాణ్యత ఉండేలా చూడాలని అన్నారు. గ్రామ స్థాయిలో విద్య, వైద్యంపై మహిళా సంఘాలు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, పాఠశాలల్లో పనులతో పాటు, తాగునీరు,మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని,అలాగే వాటి పుస్తకాలు,యూనిఫార్మ్ అందరికీ అందినది లేనిది పరిశీలించాలన్నారు.అలాగే వైద్యం విషయంలో సైతం ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండి మహిళల ఆరోగ్య విషయంపై జాగ్రత్తలు తీసుకోవాలని,సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సిజేరియన్లు తగ్గించేలా చూడాల్సిన అవసరం ఉందని ,గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా యాంటినెంటల్ చెక్ అప్ ను చేయించుకునేలా అవగాహన కల్పించాలని, గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే అన్ని సమావేశాలలో విద్యా,వైద్యం పై చర్చ జరిపేలా ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర,డి ఆర్ డివో పిడి నాగిరెడ్డి మాట్లాడారు.జిల్లా సమాఖ్య ప్రతినిధులు మహిళలు హాజరయ్యారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన యూనియన్ రాష్ట్ర నాయకులు

కల్లూరు, జూన్ 26(జనం సాక్షి)
కల్లూరు పట్టణానికి చెందిన కోఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయ్ గంగుల పుల్లయ్య ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తెలంగాణ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కనకం జనార్దన్ రావు బుధవారం గంగుల పుల్లయ్య గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగుల పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం నాగేంద్ర, జిల్లా కార్యదర్శి ఎం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ ఓం ప్రకాష్, డిసిసిబి కల్లూరు బ్రాంచ్ మేనేజర్ నాగల రాణి, అసిస్టెంట్ మేనేజర్ సత్తి పుష్ప, రిటైర్డ్ మేనేజర్ ఊటుకూరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘాల నేతలపై పెట్టిన అక్రమ కేసు కొట్టివేత



ఖమ్మం ఆర్సి, జూన్ 26(జనంసాక్షి)
2018 లో మున్సిపల్ కార్మికులు కనీస వేతనాలు, ఇతర డిమాండ్ల సాధనకై రాష్ట్ర వ్యాప్త సమ్మె జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ పోటీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించడంపై ఎ.ఐ.టి.యు.సి, సి.ఐ.టి.యు, ఐ.ఎన్.టి.యుసి, ఐ.ఎఫ్.టి.యు మున్సిపల్ కార్మిక సంఘాలు వ్యతిరేకించినందుకు నాయకులు మంద వెంకటేశ్వర్లు, తుమ్మా విష్ణు వర్ధన్ రెడ్డి, సి.హెచ్.విప్లవకుమార్, జినక శ్రీను, తాళ్ళపల్లి రాములు పై నగర పాలక సంస్థ అక్రమంగా కేసు పెట్టడం జరిగిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. 2018 సంవత్సరంలో నాయకులపై పెట్టిన కేసు నేడు కొట్టివేయడం జరిగిందన్నారు. కార్మిక సంఘాల నాయకులపై పెట్టిన కేసు కోర్టులో నాయకుల తరపున వాదనలు వినింపి కేసు కొట్టివేతకు సహకరించిన లాయర్లు పొట్లపల్లి విప్లవ కుమార్, సంధ్యా లకు మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు..

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..

**డ్రగ్స్ విష ప్రయోగంతో సమానం**

**డ్రగ్స్ సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేయాలి**

**ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి సహకారం అందాలి**

**గంట గిరిబాబు దేవరకొండ డిఎస్పి**

**విద్యార్థులు ఆధ్వర్యంలో ర్యాలీ...**




దేవరకొండ జనం సాక్షి జూన్ 26
యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలతో యువత ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావద్దని, విద్యార్థులు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని దేవరకొండ డి.ఎస్.పి గంటా గిరిబాబు తెలిపారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డిఎస్పి గంటా గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి మీనాక్షి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ శాఖ, పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ తో పాటు, మరికొన్ని సంఘాలు, విద్యాసంస్థలు, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఆరోగ్యవంతమైన యువత పైన ఆధారపడి ఉందని, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని తెలిపారు.డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిదని,వ్యవస్థలను విచ్చిన్నం చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మాట్లాడుతూ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్న భిన్నం అవుతున్నాయని, తెలిసి తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతూ ఉంటారని అన్నారు. డ్రగ్స్ వినియోగం రవాణ లేకుండా చేయవలసిన బాధ్యత ఆ అధికారులదే పోలీసులు ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్టు చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయని పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహులు, ఎమ్మార్వో సంతోష్ కిరణ్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై రమేష్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్,స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్విటి, అన్వర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## సాయిరాం రూఫింగ్ ఇండస్ట్రీ ప్రారంభించిన ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, సీఐ ధనుంజయ



కొండమల్లేపల్లి జూన్ 26 జనం సాక్షి :
కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నల్గొండ రోడ్ లో సాయిరాం రూఫింగ్ ఇండస్ట్రీని బుధవారం సీఐ ధనుంజయ, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి లతో కలిసి ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి నూతన ప్రారంభోత్సవం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కొత్త కొత్త వ్యాపారాలు అభివృద్ధి చెందడం ఎంతో సంతోషకరమన్నారు సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న నిర్మాణ పరిశ్రమ అనేక ప్రాంతాలలో ఇప్పటికే ఉన్న నూతన భవనాల పునరుద్ధరణ కారణంగా రూఫింగ్ ఇండస్ట్రీ మార్కెట్ బలమైన వృద్ధిని సాధించిందని జనాభా మరియు అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగం యొక్క డిమాండ్లను తీర్చడానికి తాజాగా వ్యాపారస్తులు, ప్రజలు రూఫింగ్ కలర్ రేకులను ఇష్టపడుతున్నారన్నారు రూఫింగ్ అనేది ప్రాథమికంగా పాలిమర్ కాంక్రీట్ మెటల్ లేదా భవనం యొక్క తయారు చేయబడిన భవనం కవరు వ్యవస్థ వర్షం మంచు సూర్యకాంతి ఉష్ణోగ్రతల తీవ్రత మరియు గాలి నుండి రక్షించబడుతుందని తెలిపారు సాయిరాం రూఫింగ్ లో తయారు చేయబడిన కలర్ రేకులను ప్రజలకు వ్యాపారస్తులకు సరళమైన ధరలకు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు అనంతరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖులను సాయిరాం రూఫింగ్ ఇండస్ట్రీ ప్రొప్రైటర్ ముత్తోజు రవి శాలువాలతో ఘనంగా సన్మానించారు వారితోపాటు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, జడ్పిటిసి సలహాదారు పసునూరి యుగేందర్ రెడ్డి, ముత్తోజు జయశంకర్, బండారు శ్రీకాంత్, సురేందర్, మాజీ సర్పంచ్ మాదుగుల యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, కోట్ల జగదీష్ పటేల్, నీలం శ్రీనివాస్ యాదవ్, బొడ్డుపల్లి శంకర్, పర్వత్ రెడ్డి, పాశం వర్ధా రెడ్డి, పాశం వేణుగోపాల్ రెడ్డి,కోమండ్ల సత్తయ్య, మాజీ ప్రిన్సిపాల్ ముత్తయ్య, పసునూరి బుచ్చా చారి, పసునూరి చెన్నయ్య చారి, గట్టుపల్లి శేఖర్ రెడ్డి, పిల్లి సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

### కనీస వేతనం 26,000 నిర్ణయించాలి:తుమ్మల వీరారెడ్డి





నల్గొండటౌన్, జూన్ 26(జనంసాక్షి)
వాస్తవ్యాప్తంగా కార్పొరేషన్లు మున్సిపాలిటీలలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 1037 లో ప్రతిపాదించిన మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీ కి అప్పజెప్పాలని నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎన్ ఎమ్ ఆర్ ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆలోపు ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగా తెలంగాణలో కూడా 21వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు పారిశుధ్య సేవలో ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని రామ్కీ తదితర ప్రైవేట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు, కొత్తగా నియమించుకున్న కార్మికులకు పాత కార్మికులతో సమానంగా వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని అన్నారు ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని దహన సంస్కారాలకు 30 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు వయసుమీరిన అనారోగ్యం కారణంగా రిటైర్మెంట్ అయిన కార్మికుడికి ఐదు లక్షలు ఇవ్వాలని వారి కుటుంబంలోని వారసులకు అదే ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆదివారం, పండుగ సెలవులు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని వాటర్ వర్క్స్ ఎలక్ట్రిసిటీ కార్మికులకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ఇంటి స్థలాన్ని కేటాయించాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శిలు దండెంపల్లి సత్తయ్య, నల్ల వెంకటయ్య, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండమల్ల శ్రీనివాస్, నల్లగొండ , చిట్యాల, చండూర్, దేవరకొండ ,అనుముల పట్టణ మున్సిపల్ కమిటీల అధ్యక్ష కార్యదర్శులు పెరిక కృష్ణ, కత్తుల సైదులు, యేసు, తారమ్మ ,కొత్తపల్లి జంగయ్య ఎస్కే జానీ, నరసింహ, వెంకట్ రెడ్డి, నరసమ్మ, శోభ, చంద్రమ్మ ,సైదమ్మ, పద్మ, నాగరాజు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం

### పూజలు అద్దుకున్న షిరిడి సాయిబాబా



దేవరకొండ జనం సాక్షి జూన్ 26
దేవరకొండ పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ అష్టాదశ వార్షికోత్సవాలతో ముస్తాబయింది. ఈనెల 26 27 తేదీలలో నిర్వహించనున్న వార్షికోత్సవంలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. మరొక రోజు పాటు సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఇల్లెందుల శ్రవణ్ కుమార్ తెలిపారు.బుధవారం మహాగణపతి పూజ పుణ్యాహవాచనం, గోమాత పూజలు జరిపారు. యజ్ఞం ప్రారంబించి ఉత్సవ హోమాలు పారాయణాలు ప్రతిష్ట దేవత హోమాలు మూల మంత్ర హోమాలు జరిగాయి. గురువారం కూడా వార్షికోత్సవ సందర్భాలు ఘనంగా జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పానుగంటి మల్లయ్య, ఇల్లందుల బుచ్చి రాములు,ఆలయ కమిటీ సభ్యులు, దేవరకొండ పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలు లేని చోట ప్రభుత్వ భూమిని ఈద్గాకు కేటాయించవద్దు



నేరేడుచర్ల జూన్ 26(జనంసాక్షి)
ముస్లిం కుటుంబాలు లేని తమ ప్రాంతాల పరిధిలో ప్రభుత్వ భూమిని ఈద్గా కు కేటాయించవద్దని పాత నేరేడుచర్ల కమలా నగర్ ప్రాంత ప్రజలు నేరేడుచర్ల తహసిల్దార్ సైదులు కు బుధవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆ ప్రాంతాల ప్రజలు మాట్లాడుతూ పాత నేరేడుచర్ల కమలానగర్ మధ్యలో సర్వే నెంబర్ 633లో ప్రభుత్వ భూమి ఉన్నదని ఆ భూమి నీ ఈద్గా నిర్మాణానికి తమకు అనుమతిచ్చారని ఒక వర్గం వారు గతంలో భూమి స్వాధీన పరచుకోవడానికి వచ్చారని అప్పుడు రెండు గ్రామాల వారు ఏకమై వారిని వారిని అడ్డుకొని ఆ స్థలం నుండి నుంచి పంపించేశామని అసలు ముస్లిమ్స్ ఏ లేని మా ప్రాంతాలలో ఆ భూమిని వారికి ఎలా కేటాయిస్తారని అన్నారు. ప్రభుత్వ భూమి సర్వే చేయడానికి వచ్చిన ప్రభుత్వ అధికారులను అడ్డుకున్న ఆ ప్రాంతాల ప్రజలు.ఈ ప్రభుత్వ భూమిని ఇల్లు లేని నిరుపేదలు కేటాయించాలని లేదా ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని గత 50 సంవత్సరాలుగా బతుకమ్మ పండుగ ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నామని దానికైనా కేటాయించాలని తాసిల్ దార్ ను కోరారు.ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో నర్సిరెడ్డి సంకలమద్ది సత్యనారాయణరెడ్డి తాళ్ల నరేందర్ రెడ్డి, పూర్ణచంద్రరావు,వెంకటరెడ్డి రామిరెడ్డి, అమృత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ప్రతాపరెడ్డి అనిత, లీలమ్మ విజయ,సుజాత,కోటమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జులై 1 న చలో రవీంద్ర భారతి

### లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తేజవత్ బెల్లయ్య నాయక్

దేవరకొండ జనం సాక్షి.జూన్ 26
లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 1న రవీంద్ర భారతిలో నిర్వహించే గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దేవరకొండ పట్టణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తేజవత్ బెల్లయ్య నాయక్ గిరిజనులకు లకు పిలుపునిచ్చారు.
గిరిజన హక్కుల కోసం ఎల్ హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో అనేక డిమాండ్లు సాధించామని .రేపు జరగబోయే జాతీయ సమ్మేళ నంలో గోర్ బోలిని రాజ్యాంగంలోని 8 షెడ్డులో చేర్చాలనే డిమాండ్ తో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు.ఈ గోర్ బంజారా సమ్మేళన్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో నేరుడుగుమ్మ ఎంపీపీ వంకునవత్ బిక్కు నాయక్, మాజి వైస్ ఎంపీపీ పాపా నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయా ఉపా అధ్యక్షుడు కేతావత్ నాగేశ్వర్ నాయక్, రాష్ట్ర నాయకులు ముడవత్ లాక్పతి నాయక్, రాష్ట కార్యదర్శి పాండు నాయక్,మజ్జి ఎంపీపీ సూక్కో నాయక్, రాష్ట ఉప అధ్యక్షుడు శక్రు నాయక్, బంజారా సేవ సంఘం అధ్యక్షుడు కొర్ర పాండు నాయక్ , లంబాడ స్టూడెంట్ ఆర్గనైజర్ రాష్ట ఉపాధ్యక్షులు కేతావత్ బాబురామ్ నాయక్, బంజారా సేవ సంఘం జిల్లా నాయకులూ నారాయణ నాయక్,శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు



# పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**మున్సిపాలిటీలలో ప్రజాపాలన హెల్ప్ డెస్క్ లు**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు**

**-జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**





సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, ఆదిశగా మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో మున్సిపాలిటీలలో అమలవుతున్న కార్యక్రమాలు, చేపట్టిన పనులు, అమృత్, ఎస్బిఎం, 15 ఫైనాన్స్, పట్టణ ప్రగతి నిధుల పనులపై అదనపు కలెక్టర్ సిహెచ్.ప్రియాంకతో కలసి పాల్గొని సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున అన్ని మున్సిపాలిటీలలో దోమలు ఉత్పత్తి కాకుండా ఫాగింగ్, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు.వార్డులలో నిరంతర పారిశుధ్య పనులు చేపట్టాలని, సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పక వినియోగించాలని సూచించారు.వార్డులలో ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీలలో త్రాగునీరు, స్ట్రీట్ లైటింగ్, ఇంటిపన్ను, నీటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలని సూచించారు.జిల్లాలో వర్షాలు తరుచుగా పడుతున్నందున మున్సిపాలిటీలలో లో లేవల్ ప్రాంతాలను ముందుగా గుర్తించి వర్షపునీరు, మురుగునీరు బయటకు పంపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో చెరువులు, రిజర్వాయర్లలో నీటిని సమృద్ధిగా నిల్వ ఉంచాలని , ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని,చెరువులు కబ్జా కాకుండా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఎప్పుడికప్పుడు నివేదికలు అందజేయాలని ఆదేశించారు.నిధుల మంజూరుకై పట్టణాల్లో చేపట్టే పనులకు జిల్లా కలెక్టర్ అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు.విలినమైన జిపిలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నర్సరీలలో అన్ని మొక్కలు అందుబాటులో ఉండాలని సూచించారు.పట్టణాల్లో ఉన్నటువంటి పార్కుల్లో ఎప్పుడికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వచ్చే ప్రజలకు ఆహ్లాదం అందించే విదంగా పార్కులు ఉండాలని పేర్కొన్నారు.ఇంకా పూర్తి కానీ వైకుంఠదామాల పనులను చేపట్టి వివరాలు అందించాలని అన్నారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అట్టి ప్రదేశాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.పట్టణంలో అనుమతుల మేరకు నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా చేపట్టే నిర్మాణాలు వారంలో రెండు సార్లు తనిఖీలు చేపట్టాలని అన్నారు ట్యాంక్ లలో ఎప్పుడికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ హోర్డింగ్ల నిర్వహణ, పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ, ధోభీ ఘాట్ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.ఎన్నికలు పూర్తవ్వడంతో అన్ని మున్సిపాలిటీలలో ప్రజాపాలన హెల్త్ డెస్క్ లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్, అశోక్ రెడ్డి,బుచ్చిబాబు, మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహిళ మెడ నుంచి 4 తులాల పుస్తెలతాడు చోరీ

చింతపల్లి జూన్ 26(జనం సాక్షి)
చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన గోరేటి బక్కమ్మ భర్త నరసింహ, వయసు 60 సంవత్సరాలు తన ఊరి శివారులో వున్న కంచెరకాలనీ వద్ద గల తన వ్యవసాయ పొలంలో నాటిన ప్రత్తి గింజలు మొలకెత్తినవా? లేదా అని చూసి రావడం కొరకు వెళ్లి, తిరిగి తన ఇంటికి రావడం కొరకు హైవే ఎక్కి ఇంటికి వస్తుండగా, అదే సమయంలో మరియు కంచెరకాలనీ సమీపంలో ఇద్దరు మగ వ్యక్తులు ఒక బైకు పైన ఆమె వద్దకు వచ్చి, 'ఇది ఏ ఊరు పెద్దమ్మ"? అని అడుగుతూ ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బరువు గల బంగారు పుస్తెల త్రాడును లాక్కొని పారిపోయినారు. ఈ విషయం గురించి చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి యాదయ్య తెలిపారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలి

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే మంజూరు చేయక పోతే సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జీపీ కార్మికుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరి వైజ్ గా వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు అరకొర వేతనాలు కూడా ఇవ్వకుండా ఆపితే కార్మికులు ఎలా బ్రతకాలో ప్రభుత్వమే చెప్పాలని అన్నారు.గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులతో మల్టీ పర్పస్ విధానాన్ని అమలు చేస్తూ, 9500 రూపాయలతో సమయ పాలన లేకుండా రోజుకు 12గంటల పైగా పని చేయించుకున్న సందర్భంగా జరిగినా 34 రోజుల సమ్మెలో అప్పటి ప్రతిపక్ష పార్టీ తరపున కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ఎందుకు మర్చిపోయారో అర్థం కావటం లేదన్నారు.నెలల తరబడి వేతనాలు రాకున్నా భరించామని ఇక తట్టుకొనే శక్తి కార్మికుల దగ్గర లేదన్నారు.మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీసం వేతనం 26వేలు ఇవ్వాలని, నేరుగా కార్మికుల అకౌంట్ లోకి వేతనాలు వేయాలని, అర్హత కలిగిన కార్మికులకు పర్మినెంట్ చేయాలని, కేటగిరి వైజ్ గా వేతనాలు అమలు చేయాలని, ఆదివారం, పండుగ రోజు సెలవులు, రెండు జతల బట్టలు, చెప్పులు, కొబ్బరి నూనె ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అద్యక్షులు ధనియాకుల శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు చిట్యాల రవి చంద్ర, వెంకటేష్, సీఐటీయూ జిల్లా నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం, సయ్యద్ జాన్ మియా,వెంకన్న, దయానంద్, బిక్షం, రాంబాబు, సైదులు, నారాయణ, గుర్వమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ వారోత్సవాలు 2024

మేళ్లచెరువు( జనం సాక్షి న్యూస్)
స్థానిక మై హెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నందు జాతీయ విద్యుత్ వారోత్సవాలు 2024 ఘనంగా ప్రారంభించినారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్లాంట్ హెడ్ మరియు ప్రెసిడెంట్ వర్క్స్ యన్.శ్రీనివాసరావు పాల్గొని విద్యుత్ భద్రత వారోత్సవాలపై కరపత్రాన్ని విడుదల చేసినారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అలాగే ఈ సంవత్సరం ప్రభుత్వం జారీ చేసిన స్లోగన్ "విద్యుత్ భద్రతను అనుసరించడం ద్వారా మీ జీవితాన్ని రక్షించుకోండి" అను విషయంపై ఆయన ఉద్యోగులకు విపులంగా వివరించారు.వర్షాకాలంలో విద్యుత్ పరికరాలతోనూ మరియు అక్కడ పని చేసేవారు తగు భద్రతా జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు గురికాకుండా జాగ్రత్త పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్ సింగ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వాత్సవ, డీజియం వేణుబాబు, సేఫ్టీ డిజియం సూర్య నారాయణ, పర్సనల్ జి యం డాక్టర్ నాగేశ్వరరావు ఉద్యోగులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

చిట్యాల జూన్ 26(జనం సాక్షి):
చిట్యాల పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక ఎస్సై సైదా బాబు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలను వివరించారు.అక్రమ రవాణా,దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని,మాదకద్రవ్యాల వల్ల జరిగే దుష్పరిమాణాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం తో జరిగే దుష్పరిమాణాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని,అవి సమాజానికి ఎంత హాని చేస్తాయో ప్రతి ఒక్కరూ తెలుసుకొని వాటి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల చేత ప్రతిజ్ఞ చేయించారు.అనంతరము పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చిట్యాల మండల తహసిల్దార్ జి కృష్ణ, సిఐ నాగరాజు,ఎంపీడీవో ఎస్పీ విజయలక్ష్మి, మండల విద్యాధికారి కే నరసింహ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు ర్యాలీలో పాల్గొనడం జరిగింది.



# పొంచి ఉన్న ప్రమాదం

## పట్టించుకోని అధికారులు..

కూసుమంచి జూన్ 26. ( జనం సాక్షి ) : మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో కోదాడ రోడ్డు నుండి పాత బొడ్రాయి బజారుకు వెళ్లే దారి నిత్యం రద్దీగా ఉండే అంతర్గత రహదారి రెండు అడుగుల వర్షపు నీటితో నిండి ప్రతిరోజు సుమారుగా రెండు మూడు వందల మంది నడిచే ఈ దారి లో ప్రతిరోజు ఏదో ఒక చిన్న ప్రమాదం జరుగుతూనే ఉంది గత ఆరు సంవత్సరాలుగా ఏ ప్రజా ప్రతినిధి కానీ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక ముస్లిం బజార్ నుండి వెళ్లే ముస్లింలు మరియు ఎరుకల బజారు నుండి వెళ్లే రైతులు సామాన్య ప్రజానీకం గత్యంతరం లేక ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఇదే దారిలో నడవక తప్పడం లేదు గతంలో ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు ఇదే గ్రామంలో బచ్చుకోటి కిరాణం షాపు మూల మలుపు దగ్గర గత నాలుగు సంవత్సరాలుగా మురుగు కాలువపై పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అక్కడ కూడా ద్విచక్ర వాహనాలు పడ్డ సందర్భాలు ఉన్నాయి అంతేకాకుండా ప్రధాన రహదారి నుండి డీలర్ బచ్చు కృష్ణమూర్తి ఇంటికి వెళ్లే దారిలో మురుగు కాలువ ప్రమాదకరంగా ఉండడంతో అక్కడ కూడా ద్విచక్ర వాహనాలు మరియు రహదారి వెంట వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు మేజర్ గ్రామపంచాయతీ అయినప్పటికీ అనేక రకాలుగా నిధులు ఉన్నప్పటికీ నిధులు సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదకర రహదారుల చూడవలసిన పరిస్థితి



దాపురించినది అని ప్రజలు వాపోతున్నారు ఇకనైనా పంచాయితీ ప్రత్యేక అధికారి స్పందించి ప్రమాదకరంగా ఉన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయించి జనావాసం ఇబ్బందులేకుండా చూడాలని ఆ విధంగా పంచాయతీ అధికారికి ఆదేశాలిచ్చి అట్టి రహదారులను మరమ్మతులు చేయించి వర్షాలు పడక ముందే సక్రమంగా చేయిస్తే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారులు ప్రజలు సంచరించడానికి వీలుగా ఉంటుందని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

## బాలుడిపై వీధి కుక్క దాడి తీవ్ర గాయాలు..




కూసుమంచి జూన్ 26 ( జనం సాక్షి ) : మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో గత రాత్రి 7 గంటల సమయంలో బుర్రి లక్ష్మణ్ కుమారుడు బుర్రి బుషి (7) తోటి పిల్లలతో తన ఇంటి వద్ద ఆడుకొనుచుండగా అకస్మాత్తుగా వీధి కుక్క బాలుడి పై దాడి చేయడంతో బాలుడు క్రింద పడిపోయాడు కింద పడ్డ బాలుడు పై కుక్క పైశాచికంగా దాడి చేసింది ఇది గమనించిన చుట్టుపక్కల వారు కుక్కను తరిమి బాలుడిని ఆర్ఎంపి దగ్గరికి తీసుకు వెళుతుండగా మరల కుక్క వారిని వెంబడించి బాలుడిపై పడి తీవ్రంగా గాయం చేసింది అక్కడ ఉన్నవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా బాలుడు ప్రాణానికే ముప్పు ఉండేది సరియైన సమయంలో చుట్టుపక్కల వారు గమనించటంతో బుషి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు గత రెండు సంవత్సరాలుగా నాయకన్ గూడెం గ్రామంలో కుక్కలు, కోతులు అనేక మందిని గాయపరిచినప్పటికీ ఇప్పటివరకు ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలన్న లేదా ఆడుకోవడానికి బయటకు పంపించాలన్న భయపడే పరిస్థితి ఉన్నది ఇప్పటికైనా ప్రజా క్షేమం కోరే నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజలను ఇబ్బంది పెడుతున్న కోతులను, కుక్కలను నియంత్రించే విధంగా చూడాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

## మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడంలో జిల్లా పోలీసు శాఖ కృషి ప్రశంసనీయం : కలెక్టర్ జితేష్.వి పాటిల్

### గంజాయి రవాణాను అరికట్టడంలో రాష్ట్రంలో మన జిల్లాదే కీలక పాత్ర : ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, జూన్26(జనంసాక్షి )

మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్బంగా బుధవారం రోజు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినీ,విద్యార్థులు పట్టణ ప్రజలతో కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు అవగాహనా ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ లు పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా అధికారులు అన్ని వర్గాల ప్రజలు,విద్యార్థులు భారీ ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక ద్వారా ర్యాలీలో పాల్గొన్న అందరూ మత్తు పదార్థాల రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.

ర్యాలీని ఉద్దేశించి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ...

మత్తు పదార్థాల నివారణ కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చత్తీస్గఢ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సరిహద్దుగా గల మన జిల్లా మీదుగా జరుగుతున్న నిషేధిత గంజాయి రవాణాను జిల్లా పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కోవడం జరుగుతుందని తెలిపారు. కేవలం ఈ ఆరు నెలల్లోనే 5000 కేజీల నిషేధిత గంజాయిని అక్రమ రవాణా కాకుండా నిరోధించి అక్రమార్కులపై కేసులు నమోదు చేయడం జరిగిందని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారుగా 30 వేల కేజీలకు పైగా గంజాయిని తగలబెట్టడం జరిగిందని అన్నారు. గంజాయి రవాణాను నిరోధించడంలో జిల్లా పోలీసుల కృషితో తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లానే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేసినా,సేవించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తెలిపారు. ఎంతోమంది యువత మత్తుకు బానిసలై తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా ఈ ర్యాలీలో పాల్గొని గంజాయి రహిత సమాజం కొరకు కదిలి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ...




అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీలో ఉత్సాహంతో పాల్గొన్న యువతను చూసి ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. శక్తివంతమైన జిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మత్తు పదార్థాలను నివారించడంలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో కీలకమని తెలియజేసారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారు కొంతమంది చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించేవారు వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు మానవుల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. యువతియువకులు మంచి అలవాట్లతో తల్లిదండ్రులు మరియు గురువుల చెప్పిన మాటలు విని చదువుతూ ముందుకు వెళితే చక్కని భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచాలని డ్రగ్ రహిత తెలంగాణ సమాజం కొరకు అందరూ కృషి చేయాలని సూచించారు. డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వారం రోజుల పాటు పట్టణాలు,మండలాలలోని పాఠశాలలు,కళాశాలలో విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు,ప్రదర్శనలు,ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

## మంత్రి తుమ్మల పరామర్శ

**- పాయం రాములమ్మ, సకిని రామచంద్రయ్య కు నివాళులర్పించిన తుమ్మల..**

**- మణుగూరులో పలువురిని పరామర్శించిన వ్యవసాయ శాఖ మంత్రి..**

మణుగూరు, జూన్ 26 జనంసాక్షి): పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మణుగూరు మండలం సమితిసింగారం లోని వారి స్వగృహానికి వెళ్లి రాములమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మణుగూరు మండలం భావి కూనవరంలోని పద్మశ్రీ గ్రహీత సకిని రామచంద్రయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి రామ చంద్రయ్యకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదని కుటుంబ సభ్యులు మంత్రిని వేడుకోగా మంత్రి స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్ తో చరవాణి లో మాట్లాడి సకిని రామచంద్రయ్య కు రావలసిన బెనిఫిట్స్ గత ప్రభుత్వం హామీలు ఇచ్చి మరిచింది. రామచంద్రయ్యకు సంబంధించిన ఫైల్ పెట్టండి. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య కాంగ్రెస్ నాయకులు అధికారులు పరామర్శించారు.






# మాదక ద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా అరికట్టాలి..

**- మాదక ద్రవ్యాల నియంత్రణ , అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి..**

**-ప్రత్యేక చికిత్స కేంద్రాలు సేవలను ఏర్పాటు చేయాలి..**

**-యువతపై దృష్టి సారించి పాఠశాలలు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు..**






మణుగూరు, జూన్ 26 (జనంసాక్షి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మణుగూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు 2కే రన్ నిర్వహించారు. మున్సిపల్, రెవిన్యూ ఇతర విభాగాల అధికారులు, జర్నలిస్టులు, పట్టణ ప్రముఖులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వల్ల యువత చెడు మార్గంలో వెళ్తున్నారు ఇలాంటి వాటిని అరికట్టడానికి ప్రతీ ఏడాది జూన్ 26న మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం జరుపుతారు. ఈ దినోత్సవం మాదక ద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా నియంత్రణ అవసరాన్ని గుర్తుచేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా దేశాలు సంస్థలు మాదక ద్రవ్యాల నియంత్రణ , అవగాహన పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంవత్సరానికి సంబంధించిన ప్రధాన థీమ్ "మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలను, వాటి నియంత్రణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం. భారత ప్రభుత్వ మాదక ద్రవ్య నియంత్రణ సంస్థలు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలు మరియు సాంఘీక సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, వక్తల ప్రసంగాల తో యువతలో మాదక ద్రవ్యాల వినియోగం ఎంత హానికరమో వారికి వివరించడం జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థలు కలిసి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

తహసిల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ....

మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు అవసరం మాదక ద్రవ్యాల వినియోగం సమాజంలో ఒక ప్రధాన సమస్యగా మారింది. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు, ప్రజలు సంయుక్తంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రజల అవగాహన పెంపొందించాలి మాదక ద్రవ్యాల అనర్థాలు, వాటి ప్రభావాలు, మరియు నియంత్రణ పద్ధతుల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ క్రమంలో శిక్షణా కార్యక్రమాలు, సాంఘీక మాధ్యమాల ప్రచారాలు, మరియు విద్యాసంస్థల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.కఠిన చట్టాలు అమలు చేయాలి: మాదక ద్రవ్యాల సరఫరా, ఉత్పత్తి, మరియు విక్రయం పై కఠిన చట్టాలు అమలు చేయాలి. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయడానికి పోలీసులు, సిబ్బంది ఇతర అధికారులు సమర్థవంతంగా పనిచేయాలిఅన్నారు.

యువత పై దృష్టి పెట్టాలి:

పాఠశాలలు, కళాశాలలు, యవ్వన వయసు వారు మాదక ద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వారికి ప్రత్యేక శిక్షణా , అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ను నిరోధించాలి.మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తే, మన సమాజాన్ని రక్షించుకోవచ్చు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పోలీస్ అధికారులు రెవిన్యూ అధికారులు, మున్సిపల్, మండల పరిషత్ ఎక్సైజ్ శాఖ ,అటవీశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పట్టణ ప్రముఖులు న్యాయవాదులు జర్నలిస్టులు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

## మంత్రులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన

## గోదావరి వరదలపై కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష

## భట్టితో కలిసి పర్యటన చేయనున్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల

కొత్తగూడెం, జూన్26(జనం సాక్షి )రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం కొత్తగూడెంలో పర్యటిస్తున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులతో కలిసి కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారు. వర్ష కాలం నేపత్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా గోదావరి వరదలపై కలెక్టరేట్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారు. ఆతరువాత సహచర మంత్రులతో కలిసి మణుగూరు బయలుదేరి వెళ్లి మాతృవియోగం పొందిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను పరమార్శిస్తారు. అదే విధంగా ఇటీవల స్వర్గస్థులైన పద్మశ్రీ ఆవార్డు గ్రహిత సకిన రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను పరమార్శించి ప్రగాడ సంతాపం సానుభూతి తెలియజేస్తారు.

**డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క పర్యటన వివరాలు**

డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి గురువారం ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి కొత్తగూడెంకు ఉదయం 9.30గంటలకు హెలిక్యాప్టర్లో బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు కొత్తగూడెంలోని ప్రగతిమైదాన్ ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ ఐటీడీఏ పి.ఒ, జిల్లా ప్రజాప్రతినిధులు ఇతర అధికారులు స్వాగతం పలుకుతారు. విద్యానగర్ డిస్టిక్ మినరల్ ఫండ్స్ రూ.4కోట్లతో సైడ్ పనులకు శంకుస్తాపన చేసిన ఆనంతరం పోస్టుఆఫీసు సమీపంలో అమృత్ 2.0 నిధులు రూ.124 కోట్లతో కొత్తగూడెం మున్సిపాలిటికి శాశ్వత మంచినీటి సరఫరా పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కలెక్టరేట్ చేరుకొని వర్షకాల నేపత్యంలో గోదావరి వరదలు వస్తే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు కొత్తగూడెం నుంచి హెలిక్యాప్టర్ బయలుదేరి మనుగూరుకు చేరుకుంటారు. ఇటీవల స్వర్గస్తులైన పద్మశ్రీ ఆవార్డు గ్రహీత సకిన రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను పరమార్శించి రాంచంద్రయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళీలు అర్పిస్తారు. ఆతరువాత పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నివాసానికి చేరుకుంటారు. మాతృవియోగం పొందిన ఎమ్మెల్యే వెంకటేశ్వర్లును పరమార్శించిన ఆనంతరం హెలిప్యాడ్ చేరుకొని మణుగూరు నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్తారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల పర్యటన నేపత్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# మత్తును మటుమాయం చేద్దాం..

చంద్రుగొండ జూన్ 26(జనంసాక్షి ):

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యతని ఎంపీడీవో అశోక్ అన్నారు. బుధవారం పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలనకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చెడు వ్యసనాలను దూరంగా ఉంటామని, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అశోక్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తనూజ, హెచ్ఎం వాజీద్, పోలీస్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యువత పుస్తకాలతో ప్రపంచ జ్ఞానం పొందండి

## మాదకద్రవ్యాల మత్తుకు లొంగకండి

టేకులపల్లి, జూన్ 26 (జనం సాక్షి):

యువత చెడు ఆలోచనలకు దూరంగా ఉంటూ పుస్తకాలతో ప్రపంచ జ్ఞానాన్ని పొందాలని, మాదకద్రవ్యాల మత్తుకు లోను కావద్దని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి సూచించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ పరిధిలో గల అన్నీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో, ఉప కేంద్రాలలో పాఠశాలల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన కల్పించారు. మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే కొన్ని మాదకద్రవ్యాలైన గంజాయి, కొకైన్, నల్లమందు మార్ఫిన్ వంటి డ్రగ్స్ నేటి యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గంలో నడిపిస్తున్నవని, ధూమపానం,మద్యపానం కంటే తీవ్రమైన ప్రభావం చూపే ఈ డ్రగ్స్ ని అక్రమ మార్గంలో అమ్మి స్మగ్లర్లు కోట్లు సంపాదిస్తుంటే దానికి బానిస అయిన యువతరం సర్వం కోల్పోతున్నారన్నారు. దీనికి బానిస అయిన వారు నిర్భాగ్యులవుతూ, కుటుంబానికి మచ్చ తేవడమే కాకుండా, నిండు జీవితాన్ని బలి చేసుకుంటు న్నారని అన్నారు. మత్తు ద్రవ్యాలకు అలవాటు పడి నేడు యువత ఎంతటి నేరాలు,ఘోరాలు, అకృత్యాలు చేయడానికి కూడా వెనుకాడటం లేదని అన్నారు. వీటి నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్ డ్రగ్స్, సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సేస్ అనే చట్టం చేసిందని డ్రగ్స్ అమ్మినవారు రవాణా చేసిన వారు, వాడిన వారు ఈ చట్ట పరిధిలో కఠినమైన శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పిల్లలు యువతరం పెద్దలు ఈ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండి బాధ్యత కలిగి దీని నిరోధానికి ప్రభుత్వానికి సహకరించవలసిందిగా ఈ సందర్భంగా సిబ్బంది విజ్ఞప్తి చేశారు. యవ్వనంలో బానిస కావాల్సింది పుస్తకానికి అని మత్తుకు గమ్మత్తుకు కాదని,బానిస కావాల్సింది జీవతానికి అని డ్రగ్స్ కు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ,గుజ్జా విజయ, నాగు బండి వెంకటేశ్వర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి, రుక్సానా,చందన, అమూల్య, హారిక, శైలజ, ఇంద్రజ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

# లారీ అదుపుతప్పి పల్టీ..

బూర్గంపహాడ్ జూన్ 26 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలో లారీ అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి%ఔ% సి జి 17 కె జెడ్ 7679 నెంబర్ గల లారీ గోధుమల లోడుతో జగదల్పూర్ నుండి రాజమండ్రి వెళుతుంది. ఈ క్రమంలో సారపాక గ్రామంలోని పాత సారపాక మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న కాలవలో పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయాల పాలయ్యారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బూర్గం పహాడ్ పోలీస్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

# శంకర్ మృతి సిపిఐ పార్టీకి తీరని లోటు..

## -సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



ఖమ్మం రూరల్,జూన్ 26: (జనం సాక్షి ) సిపిఐ పార్టీ అభ్యున్నతి కోసం సైనికుడిలా అహర్నిశలు కృషి చేసే శంకర్ మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని జాన్ బాద్ తండాలో సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. తొలుత ఏర్పాటుచేసిన స్మారక స్థూపాన్ని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎర్రజెండా చేతబట్టి పేదల సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించాడన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపును తన బాధ్యతగా స్వీకరించి ఎర్రజెండా రెపరెపలకు కృషి చేశారన్నారు. అటువంటి వ్యక్తి మృతి తీవ్రంగా కలిసి వేసిందని అన్నారు. కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. అనంతరం వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ శంకర్ నాయక్, కస్నా తండా ఎంపీటీసీ రామ్మూర్తి, కొత్త రామ్ రెడ్డి, ఇస్లావత్ రాములు ,దారేడు మాజీ సర్పంచ్ బత్తిని సీతారాములు, మాలోత్ సోమ్లా, చెరుపుల రాంబాబు, మాలోత్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ ఎనీ మియా పై అవగాహన

టేకులపల్లి, జూన్ 26 (జనం సాక్షి):
మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ ఎనీ మియా పై సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.జన్యుపరంగా తల్లిదండ్రుల నుండి వచ్చే ఈ రక్త సంబంధిత వ్యాధి తీవ్రమైన రక్తహీనత కి దారితీసి తరచుగా రక్తం ఎక్కించరావాల్సి వస్తుందని, ఈ వ్యాధి ఉన్నవారిలో రక్త కణాలు కొడవలి ఆకారంలో ఉండి రక్తనాళాలలో రక్తం శరీరంలోని ప్రతి కణానికి చేరడంలో తీవ్రమైన సమస్యలు ఏర్పడి కీళ్లలో నొప్పులు పాదాలవాపు కామెర్లు దృష్టిలోపం గుండెపోటు కిడ్నీ సమస్యలు ఎదుగుదల లోపం రకరకాల వ్యాధుల బారిన పడటం తక్కువ కాలం జీవించడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకొని మన సమాజం నుండి ఈ వ్యాధి నిర్మూలనకు సహకరించి ప్రభుత్వం వారు ఇచ్చే



సికెల్ సెల్ ఐడి కార్డు పొందవలసిందిగా సులా నగర్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్ సింగ్, వార్డెన్ సైదులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది రమా కుమారి, వెంకటరమణ, సునీత, జ్యోతి, శారద తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్

సుజాతనగర్ జూన్ 26 (జనంసాక్షి)
విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ సూచించారు.బుధవారం వేపలగడ్డ గ్రామంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ కొకైన్ మార్ఫిన్ బ్రౌన్ షుగర్ గంజాయి లాంటి మాదకద్రవ్యాల కు అలవాటు పడి యువత తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటుందన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు గంజాయిని అరికట్టడంలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు.కళాశాలలో విద్యార్థులు గంజాయికి ఎక్కువగా అలవాటు పడుతున్నారని సరైన అవగాహన లేక చెడు అలవాట్లకు బానిసలు అవ్వడానికి కారణాలు అవుతున్నాయని తెలిపారు. 18 నుండి 21 సంవత్సరాలు గల ప్రతి మనిషి కి స్వర్ణ యుగం అంటారన్నారు.ప్రతి విద్యార్థి టైం టేబుల్ ప్రకారం చదువుకుంటే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు.కళాశాల సమయంలో ఒక లక్ష్యం పెట్టుకుని చదువుకుంటే ఆ లక్ష్యం వైపు చేరుకోవచ్చని యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు.గంజాయి అలవాటు పడడం వలన తనకు తెలియకుండానే మత్తులో మునిగి మెదడు పనిచేయకుండా జీవచ్ఛవంలా మనిషి తయారవుతారని అలాంటి వారిని సమాజం చిన్న చూపు చూస్తుందని అన్నారు.గంజాయి కి అలవాటు పడటం వలన దొంగతనాలు దోపిడీలు చీటింగ్ మర్డర్లు లాంటి నేరాలకు పాల్పడి క్రిమినల్ కేసుల్లో నేరస్తులుగా నమోదు అవుతారని దీనివలన ప్రభుత్వ ఉద్యోగం రాకుండా విదేశాల్లో ప్రయాణం నికి వెళ్లకుండా భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలోచుంచుపల్లి సిఐ ఆర్ వెంకటేశ్వర్లు త్రీటౌన్ సీఐ శివప్రసాద్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు చుంచుపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ సుజాతనగర్ ఎస్ఐ జుబేదా బేగం ఏఎస్ఐ రామకృష్ణ కళాశాల డైరెక్టర్లు బత్తుల శ్రీకాంత్ సైదయ్య హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కానిస్టేబుల్ బాలు నరేష్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వికలాంగులకు అన్ని రకాల బస్సుల్లో ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలి

### ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

### రైల్లో ఉచిత రైల్ పాసులు ఇచ్చి ఉచిత సౌకర్యం కల్పించాలి

రామన్నపేట, జూన్ 26 (జనంసాక్షి)
వికలాంగులకు అన్ని రకాల బస్సుల్లో ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని ఇంద్రపాలనగరంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో వికలాంగులకు ఆర్టీసీ బస్సు పాసుల దరఖాస్తులు హైదరాబాద్ ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్ మేల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, సిటీ బస్సు పాసులు దరఖాస్తులను తీసుకోవడం జరిగిందని ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల బస్సుల్లో మెట్రో, డీలక్స్, ఎక్స్ ప్రెస్ లో ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత పాసు సౌకర్యం కల్పించింది. వికలాంగులకు బస్సుల్లో ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. బస్సులో డ్రైవర్ కండక్టర్ కూడా వికలాంగులకు సహకరించే పరిస్థితి లేదన్నారు. వికలాంగులకు సెక్యూరిటీ లేని పరిస్థితి. ఈరోజుల్లో బస్సులో ఎక్కించుకొని తీసుకుపోయే పరిస్థితి లేదు, వికలాంగులకు కేటాయించిన సీట్లో వాళ్లను కూర్చొనిచ్చే పరిస్థితి దాపరించింది. అందుకోసం రాబోయే కాలంలో వికలాంగులకు కొన్ని సీట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి వికలాంగులని బస్సులో ప్రయాణం చేసే విధంగా గవర్నమెంట్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర



ప్రభుత్వం వికలాంగులకు రైల్వే శాఖ రైల్లో ఉచిత రైలు పాస్ ఇచ్చి రైల్లో సౌకర్యం కల్పించాలని అన్నారు. రైలు ఎక్కడానికి వికలాంగులు ఇబ్బందులు పడుతారు కాబట్టి సిబ్బందిని సెక్యూరిటీగా కేటాయించాలని ఎక్కే దగ్గర ర్యాంపులు ఏర్పాటు చేయాలి. రైల్లో ప్రత్యేకంగా వికలాంగులకు రెండు బోగీలు కేటాయించలాని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఎఫ్ పి ఓ గౌరవ అధ్యక్షులు పూస బాలనరసింహ ఎన్ పి ఆర్ డి మండల అధ్యక్షులు బల్గూరి అంజయ్య ఆర్టీసీ పి హెచ్ సి బస్సు పాస్ ఇన్చార్జ్ ఆకవరం మురళీధరచారి ఎన్ పి ఆర్ డి విజన్ కమిటీ సభ్యురాలు బర్ల పార్వతి మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ దుదికాయల నర్సోజి, నల్ల సాయిలు, వడ్లకొండ తారమ్మ, సింగబోయిన నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ డి ఆర్ ఎస్ పాఠశాలలో ఏబీవీపీ ఆందోళనలు

దేవరకొండ జూన్ 26 (జనంసాక్షి)
తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పాఠశాలలు బంద్ కు పిలుపునివ్వడం విధితమే. విద్యార్థి సంఘాలు పట్టణంలోని పాఠశాలలను బైకాట్ చేసారు. డి ఆర్ ఎస్ ప్రవేట్ పాఠశాల బందు పాటించకపోవడంతో ఏబీవీపీ కార్యకర్తలు పాఠశాల వద్ద ఆందోళన నిరసనలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మరియు పాఠశాల యొక్క ఫర్నిచర్ ద్వంసం చేస్తూ బందుకు సహకరించాలంటూ పాఠశాల యాజమాన్యానికి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏబీవీపీ సభ్యులు యలమల గోపీచంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల అక్రమ ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని మరియు పాఠశాల విద్యలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జూన్ 26న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు.డిమాండ్స్.



1.ప్రైవేటు, కార్పొరేట్, పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు ఫీజాలు వసూలు చేస్తున్న యాజమాన్యాల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలి.
2.ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలి.
3.ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్ మరియు యూనిఫామ్స్ అమ్ముతున్న యాజమాన్యాల పైన కఠిన చర్యలు తీసుకోవాలి.
4.ప్రభుత్వ గుర్తింపు మరియు నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి.
5.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి.వెంటనే జిల్లా విద్యాధికారి,మండల విద్యా అధికారులను నియమించాలి.
6.ప్రభుత్వ పాఠశాలల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం లో జరుగుతున్న అవకతవకల పైన విచారణ జరిపి, నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోవాలి మరియు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి.
8.మెగా డీఎస్సీ ద్వారా 24 వేల' పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు అన్ని భర్తీ చేయాలి.
9.ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్ మరియు స్వీవెంజర్లను నియమించాలి.
10.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి.

ఈ యొక్క పది డిమాండ్లు నెరవేర్చాలని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు బంద్ కు పిలుపునివ్వడం జరిగింది.
ఈ యొక్క డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడైనా మొద్దు నిద్ర వీడి విద్యార్థుల సమస్యలపై ఆలోచన చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలియజేస్తుంది అని అన్నారు. లేని ఎడల రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగాపెద్ద ఎత్తున ధర్నాలు నిరసనలు తెలియజేస్తామని ఏబీవీపీ హెచ్చరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రెటరీ అంకోరి శ్రీకాంత్, నగర సోషల్ మీడియా ఇంచార్జ్ యలమల హేమ సుందర్, అమీతేష్, భరత్, అరవింద్, మహేందర్, శ్రీహరి, సైదులు, అర్జున్, సింహాద్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా మాలోత్ గాంధీ

లక్ష్మీదేవిపల్లి, జూన్ 26(జనంసాక్షి ) :
బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా మాలోత్ గాంధీ నియమితులయ్యారు. బుధవారం పార్టీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి రంగా కిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాలోత్ గాంధీ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమన్వయంతో పని చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేపడతామన్నారు. రాబోయే స్థానిక ఎలక్షన్లలో లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీలో అభ్యర్థులను బరిలో దించుతామని పార్టీ వార్డు స్థాయి నుంచి బలోపితం చేస్తానని ఆయన తెలిపారు తన నియామకానికి సహకరించిన పో నీశెట్టి వెంకటేశ్వర్లు. నోముల రమేష్ గౌడుగు శ్రీధర్ యాదవ్.ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు



# తుంగతుర్తిలో 28న ఉచిత వైద్య కంటి శిబిరం..

తుంగతుర్తి జూన్ 26 (జనం సాక్షి)
ఈనెల 28న మండల కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో ఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పోలవరపు సంతోష్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ శిబిరానికి హైదరాబాదు నుండి మేడి ఆసుపత్రికి సంబంధించిన కంటి డాక్టర్లు వస్తున్నందున విశ్రాంతి ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య కంటి శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు

## అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం చేయాలి..

### సిడిపిఓ వెంకటరమణ

తుంగతుర్తి జూన్ 26 (జనం సాక్షి)
అంగన్వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అంగన్వాడి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వెంకటరమణ అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో అంగన్వాడి టీచర్లకు ఈ సి సి ఈ పై మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక పాఠశాల (ప్రీ స్కూల్)ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్లేస్కూల్ నిర్వహణపై దిశా నిర్దేశం చేశామని అన్నారు.గ్రామాల్లోని 3-6 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు నర్సరీ, ఎల్ కేజీ, యుకేజీ స్థాయిలో ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగ, గణితంతో పాటు రంగుల బొమ్మలతో ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించమని అన్నారు. ప్రతి రోజు ఉదయం 9-4 వరకు వివిధ కార్యక్రమాలు, కృత్యాలతో పిల్లలకు విద్యా బోధన చేయాలని వివరించారు. పిల్లల్లో వచ్చిన మార్పులు అభివృద్ధిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ప్రమీల, లక్ష్మి ,అనురాధ ఆయా గ్రామాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక..

### ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అలీ

చింతపల్లి జూన్ 26(జనం సాక్షి)
చింతపల్లి మండల ప్రెస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అలీ(వార్త పత్రిక ), ఉపాధ్యక్షుడిగా కేశగోని పరమేశ్వర్ (నమస్తే తెలంగాణ ),ప్రధాన కార్యదర్శిగా ఆరెకంటి రాధాకృష్ణ (ప్రజాపక్షం), కోశాధికారిగా గోవింద ప్రసాద్ (వి3 న్యూస్ ఛానల్), సహాయ కార్యదర్శులుగా , కేశగోని వెంకటేష్ (మన తెలంగాణ), పోల అశోక్ (సూర్య), గౌరవ అధ్యక్షులుగా బాబన్న (నినాదం), కార్యవర్గ సభ్యులుగా వనమాల వెంకటేష్, ,జోగు వెంకటేష్,,ప్రవీణ్ శర్మ, పసునూరి వెంకటేష్, విఠల్, సతీష్, సత్యనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన తోటి రిపోర్టర్లకు ధన్యవాదములు తెలిపారు...

# పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, జూన్ 26 (జనంసాక్షి)
పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోటె శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి పార్థివ దేహానికి బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ మండల కాంగ్రెస్ నాయకులు గుత్త నర్సిరెడ్డి, జెల్ల వెంకటేశం, మొహమ్మద్ నాసర్, నకిరేకల్ నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షుడు మోటె రమేష్, గొలుసుల ప్రసాద్, కొమ్ము శేఖర్, లెంకల ప్రవీణ్, కోట సుధాకర్, మోటె మహేష్, మొహమ్మద్ అజార్ తదితరులు ఉన్నారు.

## డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు

పాలక వీడు( జనంసాక్షి) న్యూస్.విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలో భవానిపురం సున్నపు రాయి గాని డెక్కన్ సిమెంట్ సిమెంట్ కర్మాగారంలో భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా,సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను డెక్కన్ సిమెంట్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) యన్. శ్రీనివాస రాజు, ఎలక్ట్రికల్ ఏజీఎం పశ్య నరసింహ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సంవత్సరపు విద్యుత్ భద్రత నినాదం అయిన విద్యుత్తు వినియోగంలో సురక్షితమైన భద్రత విధానాలను అవలంబించడం ద్వారా జీవితాన్ని సురక్షితం చేసుకోవాలి,అనే విషయం గురించి కర్మాగార పని ప్రదేశాల్లో విద్యుత్ సంబంధిత భద్రత నియమాలను తప్పని సరిగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండేలా భద్రత పరికరాలను ధరించి పని చేయాలని అత్యంత చిన్న నిర్లక్ష్యాలు కూడా పెద్ద ప్రమాదాలకు కారణం అవుతాయని ,కర్మాగారంలో సాంకేతిక అవగాహనతో ప్రతి రోజూ జీరో ఇన్సిడెంట్స్" దే"గా మార్చుకోవడం వల్ల భద్రత పునాదులపై కుటుంబం సమాజం,నిరంతరం పరిపూర్ణమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ కె. వేణు,సీనియర్ మేనేజర్ యల్.బాబు రావ్, ఎలక్ట్రికల్ మేనేజర్ వి.రమేష్,సిబ్బంది,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

### ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ రవీందర్

ఎన్ పహాడ్, జూన్ 26 (జనం సాక్షి) :
మాదకద్రవ్యాల వినియోగానికి బానిసైన వ్యక్తి బ్రతుకు చిత్తవుతుందని ఎంపీడీవో జె వెంకటేశ్వరరావు, ఎంఈఓ రవి, ఎస్సై రవీందర్, అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మండల పారా లీగల్ వాలంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు ,ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా గంజాయి రవాణా ఎక్కువైనట్లుగా మీడియా ద్వారా తెలుస్తుందని తెలిపారు. ఇది దేశ ప్రజల భవిష్యత్తుకు అత్యంత ప్రమాద సూచిక అన్నారు. అలాగే విద్యార్థినీ, విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. తద్వారా మీ బంగారు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల కేసులలో ముద్దాయిగా ఉంటే అతను జైలు నుండి బయటకు రావడం కష్ట సాధ్యమని అన్నారు. అలాగే కేసు విచారణలో అతనిపై నేరం నిరూపణ అయితే కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. తనను తన సోదరుడిని తమ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే చేర్పించారని తాము శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదవటం చిన్నతనంగా భావించవద్దని సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారందరూ ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివి ప్రయోజకులయ్యారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఏపిఎం అజయ్ నాయక్, మండల పారా లీగల్ వాలంటీర్లు ఒగ్గు సోమన్న, గజ్జల ధర్మారెడ్డి, వరకాల అంజయ్య, ఒగ్గు ప్రవీణ్, మీసాల నాగయ్య, సిఆర్పిఎఫ్ మండల కమిటీ సభ్యులు దాసరి మట్టయ్య, కందిమల్ల మధుసూదన్ రెడ్డి, పోలీస్, ఆరోగ్య సిబ్బంది ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి యువతపై మాదకద్రవ్యాల దుష్ప్రభావం

మునగాల, జూన్ 26(జనంసాక్షి): మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడు దుష్ఫలితాలు, అక్రమ రవాణాను అరికట్టడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్యోద్దేశమని మునగాల తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థు లను సూచించారు. ప్రభుత్వం మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టిందని, యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడితే విద్యార్థుల బంగారు భవిష్యత్తో పాటు దేశ భవిష్యత్ నాశనమవుతుందని, సరదా కోసం మాదకద్రవ్యాలు తీసుకుంటే నష్టం తప్పదని, ఇలాంటి సరదాలు వద్దని సూచించారు. మాదకద్రవ్యాలు సేవించినా, వాటిని కలిగి ఉన్నా చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివిన వారు ఉన్నత శిఖరాలు అధిరోహించి వారి జీవితకాలం సుఖసంతోషాలతో ఆనందంగా గడుపుతారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై చదవకుండా, సంతోషంగా ఉన్నామని ఊహించుకుంటే జీవితమంతా కష్టాలు, శ్రమతో గడపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, ఏ.ఎస్.ఐ.నాగేశ్వరరావు, తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సాయిఈశ్వరి, మునగాల మండల పి.ఆర్.టి.యూ అధ్యక్షులు కాసాని నాగేశ్వరావు, అంబేద్కర్, ప్రసన్న కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారులు విధులపట్ల అలసత్వం వహించవద్దు

### ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

కోదాడ రూరల్, జూన్ 26(జనం సాక్షి)
కోదాడ మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ మల్లెల రాణి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి పాల్గొని మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైన తెస్తామని అధికారులు ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని,విధుల పట్ల అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. అలాగే ప్రజా ప్రతినిధులు నేరుగా గ్రామాల్లో సమస్యలను నా దృష్టికి తెచ్చి తెచ్చినట్లయితే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కృష్ణకుమారి, ఎమ్మార్వో సాయి గౌడ్, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి: సిఐ ధనుంజయ

కొండమల్లేపల్లి జూన్ 26 జనం సాక్షి :
కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ తెలిపారు సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు రోడ్డు ప్రమాదాలు దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి, ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్ రెడ్డి, జడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, చుండూరు వెంకటేశ్వర్లు,కోట్ల జగదీష్ పటేల్, మాదుగుల యాదగిరి, నీలం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

రామన్నపేట జూన్ 26 (జనంసాక్షి)
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులతో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూగ్రామపంచాయతీ కార్మికుల జీతభత్యాలను పెంచుతామని గత కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ప్రస్తుత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. 9 ఏళ్ల కెసిఆర్ పాలనలో 200 రోజుల సమ్మె పోరాటం అనంతరం, గ్రామపంచాయతీ కార్మికుల జీతభత్యాలను పెంచుతామని ఇచ్చిన హామీలకు స్పష్టమైన జీవోలను తీసుకురాలేదు. ఆనాడు గ్రామపంచాయతీ కార్మికుల అసమ్మతే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చింది. సుప్రీంకోర్టు 22 వేల రూ.ల జీతాన్ని అమలుపరచాలని తీర్పునిచ్చిన నేపథ్యంలో ప్రస్తుత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ వర్కర్లను నిర్లక్ష్యం చేయకుండా జీతభత్యాలను పెంచాలని, పెంచకపోతే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుందని నూనె వెంకట్ స్వామి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాములు, మల్లయ్య, కృష్ణయ్య, లక్ష్మమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సిని ప్రకటించాలి - గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలి

### డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్

మునగాల, జూన్ 26(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ప్రభుత్వా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల కేంద్రంతో పాటు నేలమర్రి గ్రామాల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ నియామకాలపై జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని అన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించిన విధివిధానాలు ప్రకటించాలని కోరారు. మెగా డీఎస్సీ ప్రకటించడంతో పాటు 25 వేల డిఎస్సి పోస్టులు పెంచాలని అన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీకనుగుణంగా గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1లో 1:100 పోస్టులు పెంచి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు.